చక్కని యిల్లా లైబ్రరి అంటే!
వస్తానీతో, నేనూ చూస్తా
లే లే, పోదాంపద, రా, నాన్నా!!

తండ్రి
చదువుల తల్లీ కాపురముండే
చక్కని యిల్లే లైబ్రరి అంటే॥
పోదాంపద; రా, రా, అమ్మణ్ణీ

—(౦)—

# విజయ - భారతి

విశాల రాజ్యమును హేమచంద్రుడను రాజు పాలించుచుండెను. అతని భార్య సుగుణ. పేరుకు తగిన ప్రవర్తనకలది. భర్త అడుగు జాడలలో నడచుచు రాచకార్యములయందు తనకు తోచిన సలహాల నిచ్చుచు, మిక్కిలి తెలివిగా సంచరించునది. హేమచంద్రుడు కూడ ప్రజల మనస్సులను బాగుగా నవగాహన చేసుకొని పాలించెడివాడు. ఇన్ని రాజ భోగములున్నప్పటికీ వారికి సంతాన చింత తప్పలేదు. అందుకని అనేక వ్రతములు చేశారు. దేశమునగల పుణ్యక్షేత్రములనన్నింటినీ దర్శించివచ్చారు. అన్నదాన సంతర్పణ వస్త్ర బహూకరణ యిత్యాది పుణ్య కార్యముల నెన్నిటినో చేశారు. కాని ప్రయోజనములేకపోయింది. రాజు కూడ ముసలిదశకు వచ్చాడు. తనతరువాత రాజ్యము పాలించు కొడుకులేడే అని హేమచంద్రునిబాధ. ఎత్తుకొని ముద్దాడుటకు ఒక పసిబిడ్డఐనా లేడే అని సుగుణ వేదన.

సరే యిలా కాదని ఒక రోజున రాజ్యవ్యవహారములను మంత్రి చేతులకు ఒప్పగించి అడవులకు ప్రయాణమయ్యాడు. అలా అడవిలో పోతూండగా ఒకముని ఆశ్రమం అగుపించింది. రాజువెంటనే ఆశ్రమము దగ్గరకువచ్చాడు. అక్కడ ఒక ముని తపస్సులో మునిగి వున్నాడు. చేతులు జోడించి ముని ఎదుట నిలబడ్డాడు. కొంతసేపటికి ముని కళ్లు తెరచి చూచి, "ఎవరునీవని" అడిగాడు. రాజు వినమ్రుడై సర్వ వృత్తాంతము కళ్లనీళ్లతో విశదీకరించి ఎలాగైనా సంతాన సఫలతను కలిగింపుమని కోరాడు. ముని ఒక్క సెకండు కళ్లుమూసి మరుక్షణమే చిరునవ్వునవ్వాడు. "నాయనా! నీ విషయమంతా తెలుసు. కాని దైవగతి దాటటం మనకు తరంకాదుకదా!" అన్నాడు. రాజు వెంటనే భయపడి సంగతేమిటో విశదీకరించమని కోరాడు. ముని యిలా చెప్పటం సాగించాడు. "నీవు క్రిందటి జన్మలో అక్షేపణ రాజ్యాధిపతివి. నీ పేరు చండసింహుడు, బహు క్రూరుడవు విచారణలేకండా శిక్షలు విధించేవాడివి. నిర్దాక్షిణ్యంగా చిన్న చిన్న రాజ్యాలను కబళించేవాడివి. అదేమిటని ఎవరన్నా అడిగితే శిరచ్ఛేదన చేసేవాడివి. ఇలావుండగా ఒకసారి మాళవ దేశంపై పడింది నీకన్ను. ఆపట్టణ రాజు సుబుద్ధి. చాల ఉత్తముడు. అకారణంగా నీవు ప్రకటించిన యుద్ధమును చూచి ఆశ్చర్యపోయాడు సుబుద్ధి. సుబుద్ధి వెన్ను జూపు గుణము లేనివాడగుటచే రంగంలోకి దిగాడు. సుబుద్ధి సైన్యం చాల చిన్నదగుటచే చండసింహుని దెబ్బలకు తట్టుకోలేక పోయింది. అయినా ధైర్యంతో పోరాడినాడు. కాని దుర్దృష్ట వశాత్తు సుబుద్ధి మరణించాడు. సైన్యం చెల్లాచెదరయింది. వెంటనే క్రూరసింహుడు జయ జయనినాదాలు చేస్తూ పట్టణంలోకి ప్రవేశించాడు. అప్పుడు సుబుద్ధి భార్య భర్త మరణవిషయం విని తన ఏకైక పుత్రుని రక్షించుకొనుట ఎలాగాఅని తత్తరపడసాగింది. కాని ఆమెకు నమ్మకమైన ఒక సేవకుని ద్వారా కొడుకుతో సహా బయటపడింది. కాని ఆమె అంతఃపురందాటి పోతుండగా ఒక బలమైన చెయ్యి కొడుకును లాక్కుంది. భయంతో వెనుదిరిగిచూసింది. క్రూరసింహుడు నిప్పులు కళ్లవెంట వర్షిస్తూ నిలు

చున్నాడు. కుర్రవాడిని తీసుకువెళ్దామనుకొంటున్నావేం? జాగ్రత్త. ఈ వంశాంకురం దక్కటానికి వీలులేదు. అన్నాడు గర్జిస్తూ.

ఆమె హడలి పోయింది. చండసింహుని పాదాలపై పడి వేడుకుంది. గుండెలు పగిలేలా ఏడిచింది తన బిడ్డని రక్షించమని. 'వదలిపెట్టండి. వాడికి రాజ్యమూవద్దు ఏమీవద్దు. రాయిగాయిలా బ్రతుకుతాడు. చంపకండి. ఒక్కగా నొక్కడు. భర్తను పొట్టపెట్టుకొన్నారు. ఈ పసికూన ఏం చేశాడు.' అని విలపించింది. కాని చండసింహుడు కరకురాతి హృదయంతో బిడ్డని కత్తికిబలిచేశాడు. ఆమె గుండెలు పగిలేలా ఏడుస్తూ 'దుర్మార్గుడా! అకారణంగా నా బిడ్డను పొట్టపెట్టుకున్నావ్. ఈ పసివానిని చంపిన దోషం తప్పక కొట్టితీరుతుంది. ఇది బిడ్డడిని పోగొట్టుకొని గుండెపగిలి ఏడుస్తున్న మాతృశాపము. ఏనాటికయినా యీ శాపం కొట్టి తీరుతుంది.' అని విలపించి కత్తితో పొడుచుకొని చనిపోయింది. ఆనాటి అబలశాపమే నీకీ జన్మలో కొట్టితీరింది." అని ముగించాడుముని.

హేమచంద్రుని కళ్ల వెంట జలజలా నీళ్లురాలినై.

"స్వామీ! క్షమించరాని పాపంచేశాను - నాకు ముక్తిలేదా" అన్నాడు దుఃఖకంఠంతో.

"మానవులు పాపం సులభంగా చేస్తారు. తీరా ఆ పాపఫలితం అనుభవింపవలసి వచ్చినపుడు అయ్యో" అంటారు అన్నాడుముని.

"అయితే నాకు ముక్తిలేదా స్వామీ?" అన్నాడు.

ముని వెంటనే తను కూర్చున్న మామిడివృక్షం క్రిందనుండిలేచాడు కొంచెం జలాన్ని మామిడిఫలంపై చల్లాడు. ఆఫలం తక్షణమే పరిపక్వదశచెంది తొడిమవూడింది కాని, ఆశ్చర్యంగా మధ్య నిరాధారంగా నిలబడింది రాజు చేతిలో పడకుండా. రాజు వింతపోయాడు.

ముని చిరునవ్వు నవ్వుతూ అన్నాడు - "నీవు పూర్వ జన్మలో చేసిన పాపమంతా చేరి ఆ పండు నీ చేతిలో పడకుండా చేసింది."

రాజు ముని కాళ్లమీదపడి ఎలాగైనా తనను ఆపాపంనుండి విముక్తుని చేయవలసిందని ప్రాధేయపడ్డాడు.

రాజు విచారముఖాన్ని చూసేసరికి ముని హృదయం నీరయింది. వెంటనే తాను సంపాదించుకున్న తపఃఫలంలో కొంత భాగాన్ని వినియోగించి పండును ఆశ్రయించిన పాపాన్ని పారద్రోలాడు. వెంటనే ఆ మామిడిపండు సరాసరివచ్చి రాజు దోసిలిలో పడింది. రాజు ఆ పండును కళ్ళకుఅద్దుకొని మునికి నమస్కరించాడు. "వెళ్లి నీ భార్యకియ్యి. నీకోరిక ఫలిస్తుంది" అన్నాడు ముని. తరువాత హేమ చంద్రుడు మునివద్ద సెలవు తీసుకుని రాజధానికి వచ్చాడు. భార్య జరిగిన విషయమంతా తెలుసుకొని ఫలమహత్తును విన్నతర్వాత ఎంతో సంబరపడింది.

కొంత కాలమయిన తర్వాత మహారాజు చక్కని మగబిడ్డ కలిగాడు. అందాలు చిందే ఆ ముద్దు ముఖాన్ని చూచి ఎంతగానో మురిసిపోయారు తల్లీ తండ్రీనూ. అందాలు చిందే ఆ బాలునకు "మకరంద్" అని పేరు పెట్టుకున్నారు. మకరంద్ శుక్లపక్ష చంద్రునివలె పెరుగుతూ తలిదండ్రులకు మురిపెం కూర్చేవాడు.

బాల్యంగడిచి యౌవనంలోకి అడుగుపెట్టాడు. రాజవిద్యలన్నిటిలోనూ ఆరితేరాడు. వెంటనే మకరంద్‌కు వివాహము చేసి రాజ్యభారము కుమారునకు అప్పగించవలెనని నిశ్చయించుకొన్నారు. రాజకుమార్తెల చిత్రపటముల నేకములు మకరంద్‌నకు చూపించారు. కాని మకరంద్ యిప్పుడు వివాహము చేసుకోనని అన్నాడు. తను యింకనూ దూరదేశములకు వెళ్లి నూతన విద్యలనేకములు అభ్యసించి, యితర దేశములలోని క్రొత్త క్రొత్త విషయములు తెలుసుకొని రావలెననియెడి కోరిక యున్నదన్నాడు. కాని తలిదండ్రులు లేకలేక కలిగిన ఏక సంతానాన్ని విడిచి యుండుటకు ఒప్పుకొనలేదు.

(సశేషము)

కానాధిభొట్ల సుబ్బారావు